# కొత్త రచయితలు

# లవ్ స్టోరీ

## మ—న—సా... తుళ్ళిపడకే!

లైబ్రరీ నుంచి బయట పడ్డ నేను, మబ్బులు కమ్ముకోవడం చూచి, చాలాహాయిగా ఫీలయ్యాను. ఎందుకంటే వర్షం వచ్చేముందు ఎట్మాస్ఫియర్ నాకెంతో ఇష్టం!

మా మెడికల్ కాలేజి నుంచి మా ఇల్లు దగ్గరే కావడంతో నడుస్తూ, వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తో వెడుతున్నాను. అంతలో భుజం మీద చెయ్యి పడడంతో ఉలిక్కిపడి పక్కకి చూశాను. వాణి, నాతో పాటు మెడికో. ''హాయ్'' అంటూ పలకరించాను.

''ఏవిటీ కాలేజి వదిలి చాలా సేపయిందిగా'' అంది, నా చేతిలో బుక్స్ వంక చూస్తూ. నేను చిన్నగా నవ్వేసి,''లైబ్రరీలో వుండిపోయి టైమ్ చూస్కోలేదు.'' అని బదులిచ్చాను.

''అవునూ, ఏవిటి నీకింత పరధ్యానం? నేను నిన్ను రెండుసార్లు పిలిచాను తెల్సా?'' అంది. ''వర్షం వచ్చేలా వుంది కదూ ఈ వాతావరణం అంటే నాకు చాలా ఇష్టం వాణీ, ఎంజాయ్ చేస్తూ వినిపించుకోలేదు. సారీ'' అన్నాను.

ఆమె నావైపు ఆశ్చర్యంగా చూస్తూ,''నువ్వు చెప్పేది నిజమేనా?''అంది. నేను దాని మాటలకి దానివైపు చూస్తూ,''యస్. నాకీ వాతావరణం అంటే చాలా చాలా ఇష్టం. నాకు రూపాలు మార్చే శక్తే వుండుంటే, హఠాత్తుగా ఏ నెమలినో అయిపోయి నర్తించాలనీ, రెక్కలొస్తే హాయిగా ఎగురుకుంటూ, ఆ నల్లటి మబ్బుల్తోటి ఆడుకోవాలని వుంటుంది.''అంటున్న నా వైపు విప్పారిన కళ్ళతో చూస్తూ,''నువ్వు కవితలు కూడా రాస్తావా?'' అని అడిగింది. నవ్వేసి,''ఈ వేళప్పుడు నువ్వెక్కడికి బయల్దేరావ్?''అంటూ ప్రశ్నార్థకంగా చూశాను. ''సరితా వాళ్ళింటికి''అని తను సైకిలెక్కి ''బై'' చెప్పి వెళ్ళిపోయింది.

నేను ఇంటికెళ్ళేసరికి, టపటపామంటూ పుడమి వధువు ఆకాశం వరుని చేత ముత్యాలు తలంబ్రాలుగా పోయించుకుంటున్నట్టు వర్షం...

హాల్లోనే మమ్మీ, మా తమ్ముడు సంజయ్, చెల్లెలు శృతి నా కోసమే అన్నట్టు సోఫాలో కూర్చుని ఎదురుచూస్తున్నారు. ''ఏవిటీ సభ్యులంతా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు; ఏవిటీ విషయం''అంటూ నవ్వుతూ అడిగాను.

మా శృతి,''అక్కా, మరేమో''అంది. సంజయ్ ''హుష్, నువ్వూరుకో! మమ్మీ కోప్పడుతుంది.'' అంటూ దాన్ని ఉరిమాడు. అంతే, ఇక ఇద్దరూ మమ్మీవైపు, నావైపు మార్చి, మార్చి చూస్తున్నారు.

తదేకంగా, నావైపే చూస్తున్న మమ్మీతో, 'మమ్మీ ఏవిటలా వుండిపోయావ్? కొంపదీసి, నన్ను మర్చిపోయావా? ఏవిటీ? నేను స్పందన అనే అమ్మాయిని.

ప్రస్తుతం మెడిసిన్ ఫస్టియర్ జాయినయ్యాను. వసుంధరా దేవిగారి మొదటి అమ్మాయిని, అల్లరి పిల్లని...''అంటున్న నా దగ్గరకొచ్చి, తన రెండు చేతుల్తోటీ నా ముఖం పైకెత్తి, నా నుదుటిని ముద్దెట్టుకుని, నా భుజాలపై చేతులు వేసి, తీసుకెళ్ళి సోఫాలో తన పక్కనే కూర్చుండ బెట్టుకుని, ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసి నాకిస్తూ''రియల్లీ అయామ్ ప్రౌడాఫ్‌యూ... స్పందనా!''అంది.

నేనాశ్చర్యంగా,''ఏవిటి మమ్మీ, ఏమైంది?'' అంటూ అడిగాను.''...!''ఆంధ్రజ్యోతి''లో నీ మొదటి కథ ''మరిచిపోకు నేస్తం'' అచ్చయ్యింది. ఇదిగో కాంప్లిమెంటరీ కాపీ, నేను చదివాను. నిజంగా చాలా బాగా రాసావ్ తెలుసా? నీ కథ నన్ను నా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లోకి తీసుకెళ్ళింది''అంటున్న మమ్మీ వైపు పిచ్చిగా చూస్తూ, ఆంధ్రజ్యోతి తీసుకొని మేడ మీది నా గదిలోకి పరుగెత్తాను...

నా రూమ్‌లోకి వచ్చి, తలుపులు దగ్గరగా వేసి బెడ్ మీద పడుకుని పుస్తకాన్ని గట్టిగా హత్తుకున్నాను. నమ్మలేక పోతున్నా, నిజంగా నా కథ అచ్చయిందా, ఎప్పుడో హాలిడేస్‌లో రాసి పంపిన నా కథ నిజంగా అచ్చయిందా, నా చిన్ని గుండె ఈ ఆనందాన్ని తట్టుకోలేక కాబోలు వేగంగా కొట్టుకొంటూంది!

బుగ్గల మీద జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ, పేజీలు నెమ్మదిగా తిరగవేసి, నా కథ దగ్గర ఆగిపోయాను. ''మరచిపోకు నేస్తం'' అన్న టైటిల్ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నా కళ్ళు అక్షరాల వెంట తిరగసాగాయి.

గత మూడు సంవత్సరాలుగా, నా మదిలో ఓ చిరు కదలికగా వుంటూ, నన్ను స్పందింప చేస్తూన్న ఓ నేస్తం....

నా మదిలోని భావమాలలు ఎలా నీకివ్వాలో తోచడం లేదు. కుసుమాలన్నీ నేనంటే నేనని పోటీ పడుతుంటే, మొత్తం నీకర్పిస్తున్నా.... వాటిని నీ హృదయంలోనే దాచుకుంటావో...... ఓసారి నా భావకుసుమాల సుమధుర హాసాన్ని చూసి, వాటి సుగంధాన్ని ఆఘ్రాణించి బయట విసిరివేస్తావో.... నీ ఇష్టం!

అసలు స్నేహం అంటేనే విలువ లేదు అనుకునే నీకు, స్నేహం గురించి చెప్పడం పెద్ద సాహసమే అవుతుంది.... అయినా వెనుదీయనుకో! అంటూ మొదలెట్టి, చివరిగా ''మరిచిపోకు నేస్తం, హృదయమంటే సాధ్యమా''? అంటూ ముగించాను.

అంకితం: నాలో రాయగలననే స్ఫూర్తిని కలిగించి, నాకు స్నేహాన్ని పంచినట్టే పంచి, దూరమైపోయిన ఓ అపురూప వ్యక్తి
పెన్ ఫ్రెండ్ శ్రీనివాస్

అంటూ, అంకితమిచ్చిన నా కథని చదవడం అయిపోయాక కూడా అలాగే చూస్తుండిపోయాను.

నాలో జ్ఞాపకాల తరంగాలు అలల్లా లేచాయి.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయ్...

ఎందుకు శ్రీ... ఎందుకు నాకు దూరమై పోయావ్? ఏం చేశానని? అసలెందుకు నువ్వు నాతో పెన్ ఫ్రెండ్‌షిప్ చేయడం? చేసినట్లే చేసి ఎందుకు మధ్యలో మన అపురూప స్నేహాన్ని తుంచివేశావ్?

ఈ రాత్రివేళ, అదేనోయ్, నువ్వు గుర్తొచ్చిన వేళ, ఎందుకో నా కళ్ళల్లో ఈ కన్నీళ్ళు! ఆ కన్నీళ్ళల్లో నీ రూపం కరిగిపోతోంది. కరిగి తిరిగి నా చెక్కిలిని స్పృశిస్తోంది.

భౌతికంగా నాకందరూ వున్నా, మానసికంగా నేను ఒంటరిదాన్ని శ్రీనూ, నేనీ ఒంటరి తనాన్ని భరించలేను నాకు నీ అభిమానం కావాలి, నీ సాన్నిహిత్యం కావాలి, నీ స్నేహం కావాలి ప్లీజ్... ఎక్కడున్నావ్? నన్నర్థం చేసుకో నేస్తం...

ఎక్కడో ఎవరో రాసిన వాక్యాలు, "నా తీయటి కోరిక నువ్వు. నేను పారేసుకున్న జ్ఞాపకానివి నువ్వు. నా మ–న–సు అనే సామ్రాజ్యానికి అధిపతివి నువ్వే. ఆ మూగ బాధ నీకు వినిపించడం లేదా ?"

నాకు మాత్రమే పరిమితమయ్యే వ్యక్తి నాక్కావాలి. నా ఆలోచనలు, నా బాధలు, నా చిన్ని చిన్ని ఆనందాలు, పంచుకునే నేస్తం నాక్కావాలి. ప్రపంచమంతా నన్ను వెలివేసినట్లు చూసిన క్షణంలో నేను దిక్కుతోచక ఉక్కిరి బిక్కిరయ్యే క్షణంలో, 'నీకు నేమున్నాను నేస్తం, నీ సమస్యలు నావి కావా?' అనే వ్యక్తి నాక్కావాలి శ్రీనూ, అది నువ్వే ఎందుక్కాకూడదు? అయ్యే క్షణంలో ఎందుకు దూరమయ్యావ్? అది నువ్వే అని నీకూ తెలుసు కదూ!

ఇక్కడేమో నేను, నువ్వు గుర్తొచ్చిన ప్రతి క్షణం నరకం అనుభవిస్తూ, నీ జ్ఞాపకాలతో, నీ ఆలోచనలతో ఏదో రాజ్యం కోల్పోయిన దానిలా బాధపడుతుంటాను. నువ్వేమో అక్కడ నా బాధేదీ నీది కాదన్నట్టు నీ ఫ్రెండ్స్‌తో హాయిగా కబుర్లాడేస్తూ వుంటావ్ అనే ఊహ నన్ను కోసేస్తోంది శ్రీను...

నువ్వు యండమూరి 'ఆనందో బ్రహ్మ' చదువు అన్నప్పుడు, అందులో ఏముంది? అనుకుంటూ, చదివిన నేను ఆ అనిర్వచనీయమైన అనుభూతి నుంచి తేరుకోకముందే ఎలా వుంది సందూ? "ఓ అద్భుత కావ్యంలా లేదూ, నాకది చదవగానే ఏం అనిపించిందో తెలుసా? ఓ పౌర్ణమి నాటి వెన్నెలలో తాజమహల్‌ని చూస్తుంటే నువ్వు నా ప్రక్కనే చేరి, నాతో కబుర్లు చెబుతున్న అనుభూతి! " అంటూ రాసిన నువ్వు ఎలా నాకు దూరమైపోయావ్ నేస్తం....

తన జ్ఞాపకాల నుంచి బయటపడాలనే ప్రయత్నంలో నాకిష్టమైన పాటలు రికార్డ్ చేసిన కాసెట్ తీసి టేప్ ఆన్ చేశాను. అందులో నుంచి సన్నగా, తీయగా, "మ–న–సా... తృళ్ళిపడకే, కసిగా ఆశపడకే, అతనికి నీవు నచ్చేవో లేదో, ఆ శుభ గడియ వచ్చేనో రాదో, తొందరపడకే....

★



## ఒకే ఒక్కటి!

ఒక్క జ్యోతి చాలు
వేల దివ్వెల ఎదలో ప్రాణం పోసేందుకు!
ఒక్క నవ్వు చాలు
యుగాల జ్ఞాపకాలకు పునాది వేసేందుకు!
నేస్తం...
నీ ఒక్క తోడు చాలు
బ్రతుకు అంచులవరకూ పయనించేందుకు!!

— "కిరణ్‌ప్రభ"


**రచయిత్రి చిరునామా:**

దాక్షాయణి పురిణి
నియర్ శివా టెంపుల్,
కోట–524 411
నెల్లూరుజిల్లా